News Daily
ఎడిటర్ : B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 05 | సంచిక :182 | ఖమ్మం | శనివారం, ఆగస్టు 8, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

# యుద్ధం త్వరలోనే ముగుస్తుంది

- ఇరాన్ యుద్ధాన్ని ఇక కొనసాగించలేదు
- ఇరాన్ అణ్వాయుధాన్ని అడ్డుకుంటాం
- ఎలాంటి పరిస్థితుల్లోనూ సాధించనివ్వం
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు
- ఇరాన్ ప్రజలకు యుద్ధం సెగ తగలేదు
- పొరుగుదేశాల సహకారంతోనే తట్టుకొని నిలబడ్డాం
- ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పరాకాష్టకు చేరిన వేళ ఇరాన్‌తో సాగుతున్న సైనిక ఘర్షణపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధం త్వరలోనే ముగుస్తుందన్నారు. అంతర్జాతీయ ఆంక్షలు, సైనిక ఒత్తిడి కారణంగా ఇరాన్ ఇక ఎంతమాత్రమూ ఈ ఉద్రిక్తతలను కొనసాగించలేదని అభిప్రాయపడ్డారు. ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ మార్గాన్ని పునఃప్రారంభించడంపై ఇరు దేశాల మధ్య జరుగుతున్న చర్చలపై ఆయన తీవ్ర ఆశాభావం వ్యక్తం చేశారు. ఓవల్ ఆఫీస్‌లో ట్రంప్ గురువారం( అమెరికా కాలామానం ప్రకారం) విలేకరులతో మాట్లాడారు.

వివరాలు 2లో..



# ఒంటరిగానే పోటీ..

- జీహెచ్ఎంసీ ఎన్నికలపై బీజేపీ స్పష్టత
- తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వస్తాం
- వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే పోటీ
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు
- నితిన్ నబీన్‌తో రాష్ట్ర ముఖ్య నేతల భేటీ



రానున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికల్లో.. ఏ పార్టీతోనూ పొత్తులు పెట్టుకునేది లేదని.. తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు స్పష్టం చేశారు. తమ పార్టీ ఒంటరిగానే బరిలోకి దిగుతుందని తేల్చి చెప్పారు. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే తమ ఏకైక లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. దేశ రాజధాని ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌తో తెలంగాణ రాష్ట్ర బీజేపీ కీలక నేతల సమావేశం జరిగింది. ఈ కీలక భేటీ అనంతరం.. మీడియాతో మాట్లాడిన రామచందర్‌రావు.. పార్టీ భవిష్యత్తు కార్యాచరణ, వ్యూహాలను వెల్లడించారు. తెలంగాణలో బీజేపీ ఒంటరి పోరుపై స్పందిస్తూ.. జాతీయ స్థాయిలో ఎన్‌డీఏ కూటమిలో జనసేన పార్టీ భాగస్వామిగా ఉన్నప్పటికీ.. రాష్ట్రంలో ఎన్నికల పొత్తుల అంశంపై తుది నిర్ణయాన్ని అధిష్టానమే చూసుకుంటుందని రామచందర్‌రావు పేర్కొన్నారు. ప్రస్తుతం

వివరాలు 2లో..

# ఎస్‌బిఐ వార్షికంగా 10.23% వృద్ధి

- త్రైమాసిక నికర లాభం 21,121 కోట్లు
- గతంలో ఎన్నడూ లేనంత అత్యధికంగా భం
- త్రైమాసిక ఆర్థిక ఫలితాలు విడుదల

గతంలో ఎన్నడూ లేనంత అత్యధికంగా రూ. 21,121 కోట్ల త్రైమాసిక నికర లాభం. వార్షికంగా 10.23% వృద్ధి. ఆపరేటింగ్ లాభం వార్షికంగా 9.77% పెరిగి రూ. 33,529 కోట్లకు చేరుకుంది. నికర వడ్డీ ఆదాయం (NII) గత ఏడాదితో పోలిస్తే 14.88% పెరిగి రూ. 46,992 కోట్లకు చేరింది. Q1FY27 లో 3.00% గా దేశీయ నికర వడ్డీ మార్జిన్ (NIM). Q4FY26 తో పోలిస్తే 7 బేసిస్ పాయింట్ల వృద్ధి. Q1FY27 లో 2.86%గా మొత్తం బ్యాంక్ NIM ఉంది, Q4FY26 తో పోలిస్తే 5 బేసిస్ పాయింట్ల వృద్ధి. మొత్తం వ్యాపారం రూ. 110 లక్ష కోట్లను దాటింది. ఇందులో డిపాజిట్లు రూ. 60 లక్షల కోట్లుగా మరియు అడ్వాన్సులు

వివరాలు 2లో..




# శిక్ష విధిస్తే జీవితకాలం జైలులోనే

కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఎన్నో ఉన్నాయి
సందీప్ సుల్తానియాపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు

కోర్టు ధిక్కరణ పిటిషన్ విచారణకు హాజరైన ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సందీప్ కుమార్ సుల్తానియాపై ఎన్నో కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని, శిక్ష విధిస్తే జీవితకాలం జైలులోనే ఉండాల్సి వస్తుందని జస్టిస్ నగేశ్ భీమపాక సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం తప్పుల వల్ల

వివరాలు 2లో..

# బర్త్ టూరిజంను అడ్డుకోండి!

బర్త్‌రైట్ సిటిజన్‌షిప్‌పై ఆంక్షలు
ఎగ్జిక్యూటివ్ ఆర్డర్స్ జారీచేసిన ట్రంప్
కొత్త ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులపై సంతకం



అమెరికాలో పుట్టుకతో వచ్చే పౌరసత్వాన్ని (బర్త్‌రైట్ సిటిజన్‌షిప్) పరిమితం చేయడానికి, 'బర్త్ టూరిజం'ను అణచివేయడానికి ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండు కొత్త ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులపై సంతకం చేశారు. గతంలో తీసుకువచ్చిన నిబంధన రాజ్యాంగ విరుద్ధమని అమెరికా సుప్రీంకోర్టు కొట్టివేసిన కొద్ది వారాలకే

వివరాలు 2లో..

# వర్షాల కోసం వరుణయాగం

- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- ఆగస్టు 10న నాగార్జునసాగర్‌లో యాగం
- పూర్ణాహుతిలో పాల్గొననున్న రేవంత్

రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి నదులు, జలాశయాలు జలకళ సంతరించుకోవాలని, పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం వరుణ యాగం నిర్వహించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో ఆగస్టు 10వ తేదీన ఉమ్మడి నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని విజయ విహార్ ప్రాంగణంలో ఈ యాగం వైభవంగా జరగనుంది. ఎల్ నినో ప్రభావం నుంచి విముక్తి కలిగి,

వివరాలు 2లో..



# చిన్నతరహా పరిశ్రమలకు పెద్దపీట

చేతివృత్తులు, రైతులకు మార్కెట్ అవకాశాలు
బ్రిక్స్ మంత్రుల సమావేశంలో నర్ణయం
కేంద్రమంత్రి పీయూష్ గోయల్

దేశంలోని చిన్న తరహా పరిశ్రమలు, చేతివృత్తుల కళాకారులు, రైతులు, మత్స్యకారుల ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో అవకాశాలు పెంచేందుకు వీలుగా కేంద్రం సరికొత్త చర్యలు తీసుకుంది. ఇందుకోసం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నిబంధనలను సవరించినట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. జైపూర్‌లో జరిగిన 'బ్రిక్స్' వాణిజ్య, పరిశ్రమల మంత్రుల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ-కామర్స్ ద్వారా అంతర్జాతీయ

వివరాలు 2లో..

# ఫీజుల వివరాలను పారదర్శకంగా వెల్లడించాలి

ఫీజుల వివరాలు డిస్‌ప్లే చేయాల్సిందే
ప్రైవేట్ స్కూళ్లకు విద్యాశాఖ ఆదేశాలు
నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు

తెలంగాణ ప్రభుత్వం ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలలపై కీలక నిర్ణయం తీసుకుంది. విద్యార్థుల నుంచి వసూలు చేసే పాఠశాల ఫీజుల వివరాలను పారదర్శకంగా వెల్లడించాలని రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజుల నిర్మాణాన్ని అన్ని పాఠశాలలు తప్పనిసరిగా ప్రదర్శించాలని స్పష్టం చేసింది. రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ఫీజుల

వివరాలు 2లో..

# నీట్‌పై సీబీఐ ముమ్మర దర్యాప్తు

- పేపర్ లీక్‌పై ఛార్జ్‌షీట్ దాఖలు
- 13 మంది నిందితులపై దాఖలు
- వెలుగులోకి విస్తుపోయే నిజాలు!




దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై సీబీఐ ముమ్మర దర్యాప్తు జరపగా ఛార్జ్‌షీట్‌లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. పలువురు ఎన్‌టీఏ నిపుణులు, మధ్యవర్తులు ఒక వ్యవస్థీకృత ముఠాగా ఏర్పడి ఈ రాకెట్‌ను నడిపించారని కేంద్ర దర్యాప్తు సంస్థ నిరూపించింది. పుణేలోని ఒక నివాస సముదాయానికి చెందిన యాక్సెస్ కంట్రోల్ యాప్, మొబైల్ ఫోన్ లొకేషన్లు, బయోమెట్రిక్ రికార్డుల ఆధారంగా ఈ కేసులో 13 మంది నిందితులపై సీబీఐ ప్రత్యేక కోర్టులో 94 పేజీల చార్జ్‌షీట్ దాఖలు చేసింది. ప్రవేశ పరీక్ష తయారీలో భాగమైన మూడు సబ్జెక్టుల నిపుణులు ప్రశ్నలను ఎలా లీక్ చేశారో సీబీఐ వివరించింది. పీవీ కులకర్ణి, మనీషా మాందరే, మనీషా హవల్దార్ ఈ లీకేజీ వెనక ప్రధాన కారకులని పేర్కొంది. వీరు ప్రశ్నలను గుర్తుపెట్టుకోవడం, చీటీలపై రాసుకోవడం, పుస్తకాల్లో సంబంధిత పేరాలను మార్క్ చేయడం వంటి పద్ధతులను నిందితులు అనుసరించారని వివరించింది. కులకర్ణి కెమిస్ట్రీ నిపుణుడు కాగా మిగతా ఇద్దరు బోటనీ, ఫిజిక్స్‌లో

వివరాలు 2లో..



# హైదరాబాద్‌లో భారీ బస్ టెర్మినల్ నిర్మాణం

- గాజులరామారంలో 100 ఎకరాల్లో ఏర్పాటు
- ట్రాఫిక్ ను తగ్గించేందుకు ప్రభుత్వ ప్రణాళిక
- లోక్‌సభలో ధ్రువీకరించిన కేంద్రమంత్రి గడ్కరీ

హైదరాబాద్ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. నగర శివారులోని గాజులరామారంలో 100 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక బస్ టెర్మినల్ నిర్మాణానికి భూమి కేటాయించినట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధికారికంగా ప్రకటించారు. ఈ బస్ టెర్మినల్ నిర్మాణం పూర్తయితే నగరంలో ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని

వివరాలు 2లో..

# ఏన్కూరు బ్రిడ్జిపై వరద నీరు..

| వరద నీటిలోనే వాహనాల రాకపోకలు




**సీకే న్యూస్ ఖమ్మం ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఆగస్టు 07 2026:** ఖమ్మం--భద్రాచలం ప్రధాన రహదారిపై ఏన్కూరు మండల కేంద్రంలోని ఎన్ఎస్పీ కాలువ బ్రిడ్జిపై వరద నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా బ్రిడ్జిపై నీరు చేరడంతో రహదారి స్పష్టంగా కనిపించక ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయి.

ఈ మార్గంలో ప్రతి రోజు వందలాది ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, లారీలు, ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. బ్రిడ్జిపై నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు భయాందోళనల మధ్య ప్రయాణం కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అదేవిధంగా, పెద్ద వాహనాలు అధిక వేగంతో బ్రిడ్జిపై ప్రయాణిస్తున్న సమయంలో వరద నీరు, బురద ద్విచక్ర వాహనదారులు, పాదచారులపై చిమ్ముతుండటంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బురద నీరు కళ్లపై పడటంతో వాహనాలపై నియంత్రణ కోల్పోయి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశముందని ప్రజలు చెబుతున్నారు. పంచాయతీ అధికారులు, ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు, సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి బ్రిడ్జిపై నిల్వ ఉన్న నీటి సమస్యను పరిష్కరించి, ప్రమాదాలు జరగకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

# 50 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని జంగాల కాలనీ

### బురద రోడ్డులో నాట్లు వేసి నిరసన
### విద్యుత్ , రోడ్ల కోసం ఎదురుచూపులు

**సీకే న్యూస్ ఖమ్మం ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఆగస్టు 07 2026:** మండల కేంద్రంలోని జంగాల కాలనీలో సుమారు 100 కుటుంబాలు గత 50 సంవత్సరాలుగా నివసిస్తున్నప్పటికీ ఇప్పటి వరకు కనీస మౌలిక వసతులకు నోచుకోవడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు కాలనీకి వచ్చి విద్యుత్ స్తంభాలు, రోడ్లు ఏర్పాటు చేస్తామని హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకుంటున్నారని, ఎన్నికలు ముగిసిన అనంతరం తమ సమస్యలను పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు.

కాలనీలో సరైన రహదారి లేకపోవడంతో వర్షాలు కురిసిన సమయంలో రోడ్లు పూర్తిగా బురదమయంగా మారుతున్నాయని తెలిపారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సైతం ఇదే బురద రోడ్లపై నడుచుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. మరోవైపు కాలనీలో విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో చీకట్లోనే జీవనం సాగించాల్సి వస్తోందని, పాములు సంచరిస్తుండటంతో భయాందోళనకు గురవుతున్నామని పేర్కొన్నారు.

వెనుకబడిన జంగాల సామాజిక వర్గానికి చెందిన వారు కావడం వల్లే తమ కాలనీ అభివృద్ధికి నోచుకోవడం లేదని కార్మిక సంఘం నాయకులు ఇటికాల లెనిన్ ధ్వజమెత్తారు.




ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆరోపించారు.

కాలనీలో తక్షణమే విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడంతో పాటు రహదారులను నిర్మించి మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వ యంత్రాంగాన్ని, ప్రజాప్రతినిధులను ఆయన కోరారు. బురద రోడ్డులో నాట్లు వేసి కాలనీ రహదారుల దుస్థితిని అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు కాలనీ వాసులు వినూత్నంగా నిరసన తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి జంగాల కాలనీకి విద్యుత్ స్తంభాలు, రహదారులు ఏర్పాటు చేసి తమ సమస్యలను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

**సీకే న్యూస్** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం కేంద్రంలో ఉన్న చెరువు కాలువ నుండి ముద్దపురం వరకు ఆయకట్టు కాలువలో ఉన్న గుర్రపు డెక్క ఆకు తొలగింపు వెంటనే చేపట్టాలని రైతు బాంధవులు స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆదేశంసారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వలిగొండ చెరువు కాలువ దగ్గర హిటాచి ద్వారా గుర్రేపు డెక్క ఆకు తొలగింపు వెంటనే తీయడం ఈరోజు ప్రారంభించినారు.


మీడియా ద్వారా మండల నాయకులు గరిసె రవి పాశం సత్తిరెడ్డి సామరామిరెడ్డి బత్తిని సహదేవు మాట్లాడుతూ.

రైతు బాంధవులు రైతు సంక్షేమశీ కోసం 24 గంటలు ఆలోచన చేసే ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు రైతుల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు మండల నాయకులు మీడియా ద్వారా తెలియజేసినారు.

ఈ కార్యక్రమంలో వలిగొండ సర్పంచ్ కుంభం వెంకట పాపిరెడ్డి పిఎసిఎస్ చైర్మన్ గరిసే రవి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు రేసుబుచ్చిరెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ జక్కా జంగారెడ్డి, ఎక్స్ ఎంపీటీసీ పలుసం సతీష్ గౌడ్, బద్దం సంజీవరెడ్డి,కాసుల వెంకన్న, ఐటిపాముల రవీందర్ ఉలిపే మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

# 'ఎలాగైనా నా భర్తను చంపు.. లేదంటే నేను చనిపోతా'

| భార్య చాటింగ్‌తో షాక్‌కు గురైన భర్త.. డోర్నకల్ పోలీస్ స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్



**డోర్నకల్,సి కే న్యూస్ :** భర్తను హత్య చేయాలని ప్రియుడిని కోరుతూ భార్య పంపినట్లు చెబుతున్న వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ సందేశాలు వెలుగులోకి రావడం కలకలం రేపింది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామంలో వెలుగుచూసింది. చిలుకోడుకు చెందిన గాదె రాజేశ్వరరావుకు 2016లో సూర్యాపేట జిల్లాకు చెందిన భవానితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే తన భార్య భవానికి సైదులు అనే కొరియర్ బాయ్‌తో వివాహేతర సంబంధం ఉన్నట్లు రాజేశ్వరరావు ఆరోపించారు. ఈ విషయం గత నెల 27న తనకు తెలియడంతో రాజేశ్వరరావు పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం తన అన్నను తీసుకురావడానికి వెళ్తున్న సమయంలో సైదులు తనను వెంబడించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అతని నుంచి తప్పించుకుని ఇంటికి తిరిగి వచ్చిన రాజేశ్వరరావు.. తన భార్య ఫోన్‌ను పరిశీలించినట్లు తెలిపారు. అందులో తనను ఎలాగైనా చంపాలని, లేదంటే తాను చనిపోతానని భవాని సైదులుకు పంపినట్లు చెబుతున్న సందేశాలను గుర్తించినట్లు రాజేశ్వరరావు పేర్కొన్నారు.

# శాన్‌ఫ్రాన్సిస్కోలో ఉప ముఖ్యమంత్రి భట్టికి ఘన స్వాగతం

| భారత కాన్సులేట్‌లో 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి



**పాలకుర్తి,సి కే న్యూస్ :** అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో భారత కాన్సుల్ జనరల్ డా. శ్రీకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన "మీట్ అండ్ గ్రీట్" కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక భారతీయ సంఘాల ప్రతినిధులు, ప్రవాస భారతీయులు పరస్పరం ఆత్మీయంగా మమేకమయ్యారు. ప్రవాస భారతీయులతో మాట్లాడిన ఉప ముఖ్యమంత్రి వారి అభిప్రాయాలు, సూచనలను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ప్రవాస భారతీయుల పాత్ర ఎంతో కీలకమని, రాష్ట్రంతో వారి అనుబంధం మరింత బలోపేతం కావాలని భట్టి విక్రమార్క ఆకాంక్షించారు. ప్రవాస భారతీయులు కూడా రాష్ట్ర అభివృద్ధికి తమవంతు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజాప్రతినిధులు, ప్రవాస తెలంగాణ ప్రజలు, భారతీయ సంఘాల ప్రతినిధుల మధ్య పరస్పర సంబంధాలు మరింత బలపడినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

# 'చేతిలో గొడుగు.. జనంతో అడుగు..!'



**సికె న్యూస్ ప్రతినిధి** ఏదులాపురం మున్సిపాలిటీ : ఆకాశం వర్షిస్తోంది... వాన తుంపరలు కాలనీ బాటలను తడుపుతున్నాయి... అయినా ఆ ప్రజా సంకల్పం ఆగలేదు! వర్షం పడుతున్నా ఏమాత్రం వెనకడుగు వేయకుండా, ఒక చేతిలో గొడుగు పట్టుకుని ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగారు తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి. శుక్రవారం ఉదయం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 22, 23వ వార్డులైన సాయిగణేష్ నగర్, ఇందిరమ్మ కాలనీల్లో జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర్‌తో కలిసి మంత్రి సాగించిన క్షేత్రస్థాయి పర్యటన పాలనకు ఒక కొత్త నిర్వచనాన్ని ఇచ్చింది.

**– నడివీధి టీ కొట్టు వద్ద నలుగురిలో ఒకడై... వేడి టీ కప్పుతో ఆప్యాయ పలకరింపులు**

హంగులు లేవు... ఆర్భాటాలు అసలే లేవు! పర్యటన మధ్యలో సాయిగణేష్ నగర్ వీధిలోని ఒక చిన్న టీ కొట్టు వద్ద మంత్రి ఆగిపోయారు. సామాన్య పౌరుడిలా అక్కడ ఉన్న బెంచ్ మీద ఆసీనులై, స్థానికులతో కలిసి వేడివేడి టీ తాగారు. ఆ తేనీటి కప్పు నురగల్లోంచే ప్రతి ఇంటా ఉన్న సమస్యలను ఆప్యాయంగా పలకరించారు. తాగునీటి తిప్పలు, కరెంట్ తీగల భయాలు, వర్షపు నీటి ఇబ్బందులను ప్రజలు మంత్రి ముందు ఉంచగా... 'నేనున్నాను' అంటూ భరోసానిచ్చారు. తమ ఊరి నేత తమ పక్కనే కూర్చుని టీ తాగుతూ కష్టసుఖాలు వినడంతో కాలనీవాసుల సంతోషం వ్యక్తం చేశారు.

**– రూ.100 కోట్ల నిధులతో... మోడల్ మున్సిపాలిటీగా ఏదులాపురం రూపకల్పన**

ఏదులాపురం మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా రూ.100 కోట్ల నిధులు ఈ మంజూరు చేశారని ఈ సందర్భంగా మంత్రి ప్రకటించారు. గ్రామ పంచాయతీల కలయికగా ఏర్పడిన ఈ ప్రాంతాన్ని రాష్ట్రంలోనే నంబర్ వన్ మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. వర్షపు నీరు నిలిచే లోతట్టు ప్రాంతాల్లో శాశ్వత డ్రైనేజీ నిర్మాణాలు, తుమ్మ చెట్ల తొలగింపు, తాగునీటి సరఫరాను మెరుగుపరచడం వంటి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడతామని హామీ ఇచ్చారు.

**– ప్రజా అవసరాలే ప్రాధాన్యం... అధికారులకు ఆదేశాలు**

ఇందిరమ్మ ఇళ్లు, స్థలాల కోసం ప్రజలు సమర్పించిన వినతులను ప్రభుత్వం అత్యంత సానుకూలంగా పరిశీలిస్తుందని మంత్రి పునరుద్ఘాటించారు. మున్సిపాలిటీలో కొనసాగుతున్న పార్కుల అభివృద్ధి పనులను ఈ నెలాఖరుకల్లా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని, అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉంటూ పనుల్లో నాణ్యత పాటించాలని ఆదేశించారు.

ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, ఏదులాపురం మునిసిపల్ చైర్‌పర్సన్ అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మునిసిపల్ కమీషనర్ శ్రీనివాస్, ఆర్అండ్‌బీ ఎస్‌ఈ యుగంధర్, పంచాయతీ రాజ్ ఎస్‌ఈ వెంకట్ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్‌ఈ శ్రీనివాస చారి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, ఆర్డీఓ శ్రీనివాస్ మరియు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



**బోథ్. సి కె న్యూస.**మండలంలోని ధన్నూర్ బి గ్రామంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ చేనేత నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు ఆసాల సదాశివ్ మాట్లాడుతూ చేనేత కార్మికులకు ప్రభుత్వం ఆర్థిక సహాయ సహకారులతోపాటుగా పింఛన్ ను అందించాలని డిమాండ్ చేశారు. అలాగే చేనేత వస్త్రాలకు ప్రభుత్వపరంగా ప్రచారం కల్పించాలని కోరారు. ముఖ్యంగా ప్రతి పద్మశాలి బిడ్డా చేనేత వస్త్రాలను ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు సంతోష్ నరసయ్య నారాయణ ఎర్రన్న గణేష్ రాజేశ్వర్ సాయికిరణ్ సురేష్ కుల బంధువులు పాల్గొన్నారు

# గడువు ముగిసిన సిరప్ ఇవ్వడంతో తండ్రి ఆగ్రహం

### మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఘటన..సిబ్బందితో వాగ్వాదం

**మహబూబాబాద్, సి కే న్యూస్ :** మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ చిన్నారికి గడువు ముగిసిన సిరప్‌ను అందించడంతో బాలుడి తండ్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరానగర్ కాలనీకి చెందిన మురళీ తన నాలుగేళ్ల కుమారుడు ఎనోస్ రాజ్‌ను వాంతులు, విరోచనాలతో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. వైద్యులు చిన్నారిని పరీక్షించి రెండు రకాల సిరప్‌లు సూచించారు. అందులో ఒక సిరప్‌ను ఆసుపత్రి ఫార్మసీ నుంచి అందజేయగా, మరో సిరప్‌ను బయట నుంచి కొనుగోలు చేయాలని సూచించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇంటికి వెళ్లిన తర్వాత ఆసుపత్రి నుంచి ఇచ్చిన సిరప్‌ను బాలుడికి వేయబోతుండగా, దాని గడువు 2026 జూన్ నెలలోనే ముగిసినట్లు తండ్రి గుర్తించాడు. దీంతో వెంటనే ఆసుపత్రికి వెళ్లి సిబ్బందిని నిలదీశాడు. ఈ సందర్భంగా సిబ్బందికి, బాలుడి తండ్రికి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. "గడువు ముగిసిన మందు ఇస్తే పిల్లాడు చావాలా..?" అంటూ తండ్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



# చనిపోయాకా గుర్తుండేలా బ్రతకడమే గొప్ప జీవితం!

- కన్నేటి వెంకన్న సేవలు చిరస్మరణీయం : మంత్రి పొంగులేటి
- మంగళగూడెంలో విగ్రహావిష్కరణ.. ఘనంగా ద్వితీయ వర్ధంతి



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం రూరల్ :** ఈ భూమిపై పుట్టిన ప్రతి ఒక్కరూ ఏదో ఒకరోజు మరణించక తప్పదని, అయితే చనిపోయిన తర్వాత కూడా సమాజం తలుచుకునేలా, ప్రజల గుండెల్లో నిలిచిపోయేలా జీవించడమే అత్యున్నతమైన జీవితమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం రూరల్ మండలం మంగళగూడెం గ్రామంలో శుక్రవారం సీనియర్ కాంగ్రెస్ నాయకులు స్వర్గీయ కన్నేటి వెంకన్న రెండో వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వెంకన్న విగ్రహాన్ని మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. అంతకుముందు గ్రామంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని కూడా మంత్రి ఆవిష్కరించారు.

**– పదిమందికీ మేలు చేయడమే అసలైన సంపాదన : మంత్రి పొంగులేటి**

"మానవ జన్మలో సంపాదించే ఆస్తిపాస్తుల కంటే, నలుగురికి చేసిన సాయం, సంపాదించుకున్న అభిమానమే శాశ్వతంగా నిలిచిపోతుందన్నారు. కన్నేటి వెంకన్న తన జీవితాంతం ప్రజల కోసమే తపించారని కొనియాడారు. ఏ కష్టం వచ్చినా 'నేనున్నానంటూ' నిలబడ్డారని, అందుకే ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన రూపం విగ్రహమై ఈ ఊరిలో నిలిచిందన్నారు. ఆయన చూపిన సేవా మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కన్నేటి వెంకన్న కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ధర్మసాగర్ లో ఘనంగా ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవ వేడుకలు.



**సీకే న్యూస్ ఆగస్టు 7 శుక్రవారం హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్:** పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్న ఆదేశాల మేరకు ధర్మసాగర్ మండల కేంద్రంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ సమీపంలో ఎంఆర్పిఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు నక్క ప్రవీణ్ మాదిగ గారి ఆధ్వర్యంలో ఆగస్టు 7న ఆరోగ్యశ్రీ సాధన ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసుకొని ఆరోగ్యశ్రీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది,

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గంగారపు శ్రీనివాస్ మాదిగ ఎమ్మార్పీఎస్ ధర్మసాగర్ మండల ఇంచార్జి పాల్గొని మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఏబిసిడి వర్గీకరణ కోసం ఆవిర్భవించినప్పటికీ ఏబిసిడి వర్గీకరణ సాధన కోసం ఉధృతమైన పోరాటాలు చేస్తూనే మరోవైపు చిన్నపిల్లల గుండె ఆపరేషన్ల విషయం గురించి తెలుసుకొని చలించిపోయి ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని కూడా చిన్నపిల్లల గుండె ఆపరేషన్ల కోసం సమయాన్ని కేటాయించి పోరాటం చేసిన ఫలితంగానే ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు క్రీస్తు శేషులు, డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాంలో చిన్నపిల్లలకు గుండె ఆపరేషన్లు చేయడం జరిగిందన్నారు అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి దీనిని ప్రామాణికంగా తీసుకొని సమాజంలోని కుల మతాలకు అతీతంగా ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా ఉండాలని ఉద్దేశంతో ఆరోగ్య శ్రీ పథకాన్ని తీసుకురావడం జరిగింది ఈ పథకం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్న ఆధ్వర్యంలోనే సాధించుకున్నందున ఈరోజు ప్రతి గ్రామంలో , మండల కేంద్రాలలో ఆరోగ్య శ్రీ సాధన దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు.

కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పుట్ట ప్రణయ భాస్కర్, నక్క ప్రశాంత్,పుట్ట నరేష్, కొట్టె భాస్కర్, వెంకటస్వామి, చిరంజీవి, మహిళలు తదితరులు పాల్గొన్నారు,

## నాగులవంచ ఎస్సీ బాలుర వసతి గృహంలో "నషా ముక్త్ భారత్ అభియాన్" ప్రతిజ్ఞ కార్యక్రమం.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని : షెడ్యూల్డ్ కులాల బాలుర వసతి గృహం, నాగులవంచలో "నషా ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమం సందర్భంగా విద్యార్థులతో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు మరియు చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా అవగాహన కల్పిస్తూ ప్రతిజ్ఞ చేయించారు.

ఈ సందర్భంగా బ్రహ్మకుమారిస్ ఈశ్వర్య విశ్వవిద్యాలయం, ఖమ్మం శాఖ ప్రతినిధులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, చెడు అలవాట్లు, మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ మంచి నడవడికను అలవర్చుకోవాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా, సంక్షేమ సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని చదువులో ఉత్తమ ఫలితాలు సాధించి జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని, భావితరాలకు ఆదర్శంగా నిలవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారిస్ బాధ్యులు రాజయోగిని అరుణ, గోవిందాచార్యులు, సురేష్ పాల్గొని విద్యార్థులకు రాజయోగం, విలువలతో కూడిన జీవన విధానంపై అవగాహన కల్పించారు.

కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారి కొత్త వెంకటేశ్వరరావు, సిబ్బంది దిలీప్ కుమార్, మహేందర్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## తొర్రూరులో ఎరువుల దుకాణాల తనిఖీలు

- పారాక్వాట్ గడ్డి మందుల విక్రయిస్తే కఠిన చర్యలు: అధికారులు హెచ్చరిక



**తొర్రూరు,సి కే న్యూస్ :** పట్టణంలోని ఎరువులు, పురుగుమందుల విక్రయ దుకాణాల్లో వ్యవసాయ అధికారి (ఏఓ) రామ్ నర్సయ్య, ఎస్సై మహేందర్ రెడ్డి శుక్రవారం సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాల లైసెన్సులు, స్టాక్ రిజిస్టర్లు, మందుల నిల్వలు, విక్రయ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నిషేధిత లేదా నిబంధనలకు విరుద్ధంగా పారాక్వాట్ (ౡఖతీఖనబఖ్) గడ్డి మందులను విక్రయించినట్లు గుర్తిస్తే సంబంధిత దుకాణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని, రైతులకు అనుమతించబడిన నాణ్యమైన ఎరువులు, పురుగుమందులనే విక్రయించాలని సూచించారు. వ్యవసాయ రంగంలో నిబంధనల అమలుపై రాజీ ఉండదని, తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు.

## ఎల్ నినో పరిస్థితుల్లో ఆరుతడి, కూరగాయల పంటల సాగు మేలు"" "మహిళా సంఘాల సహకారంతో కూరగాయల సాగు విస్తీర్ణాన్ని పెంచాలి -కూరగాయల సాగుతో నిత్య ఆదాయం



**మహబూబాబాద్, జూలై.07 సికే న్యూస్ (పతినిధి:దుర్గం మురళి** గౌరవ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఐ.ఏ.ఎస్.,గారి ఆదేశాల ప్రకారం మహబూబాబాద్ జిల్లాలో 4000 ఎకరాలలో కూరగాయలు సాగు విస్తీర్ణానికి ప్రణాళిక సిద్ధం చేయడం జరిగింది. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని జిల్లా ఉద్యానవన మరియు పట్టు పరిశ్రమ శాఖ కార్యాలయంలో ఉద్యానవన శాఖ అధికారి జినుగు మరియన్న అధ్యక్షతన మండలాల సంబందిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో 524 ఎకరాల్లో మహిళా స్వయం సహాయ సంఘాల ద్వారా, వ్యవసాయ సహకారంతో కూరగాయలు సాగును చేపట్టడం జరిగింది. ప్రస్తుత వానాకాలంలో అనుకూలంగా ఉన్న టమాటా, వంగ, పచ్చి మిరప, బీర,సొర,కాకర, బోడ కాకర,బెండ, చిక్కుడు, ఆకుకూరలు, మొదలైన అన్ని రకాల కూరగాయలను సాగు చేస్తున్నారు. కురవి, డోర్నకల్, మరిపెడ ,చిన్నగూడుర్, నర్సింహులపేట, తొర్రూరు, దంతాలపల్లి, నెల్లికుదురు, మహబూబాద్, గూడూరు, కేససముద్రం, కొత్తగూడ, గంగారం, తదితర అన్ని మండలాల్లో జిల్లా వ్యాప్తంగా సాగు చేస్తున్నారు. కూరగాయ రైతులు ఆధునిక పద్ధతులు ( పందిరి సాగు , ట్రెల్లిస్ , ఎత్తు మడులు, మల్చింగ్ , బిందు సేద్యం, ఫారం పాండు ( నీటి కుంటలు – పంట కుంటలు) సేంద్రియ పద్ధతులు, నేచురల్ ఫార్మింగ్ , మార్కెటింగ్ , తదితర వాటిని రైతులు పాటించే విధంగా సన్నద్ధం చేయాలని తెలిపారు. రైతు రైతులకు ఎకరానికి లక్ష రూపాయలు ఆదాయం వస్తుంది. కనుక రైతులను కూరగాయల సాగు చేసే విధం గా అవగాహన కల్పించాలని తెలిపారు.

ఈ సమావేశంలో ఐకెపి ఋవీ శ్రీకాంత్, ఉద్యాన అధికారులు ూజీ శాంతిప్రియదర్శిని,వీ స్రవంతి, కార్యాలయ సిబ్బంది జ్యోస్న, సుకన్య, రామకృష్ణ, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వీఓ భవనాన్ని పరిశీలించిన అధికారులు

**ఏన్కూరులో జలసిరి కార్యక్రమంలో అభివృద్ధి పనుల తనిఖీ**



**సీకే న్యూస్ ఖమ్మం ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఆగస్టు 08 2026:** జలసిరి కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ కమిషనర్ శుక్రవారం ఏన్కూరు మండలంలోని పలు గ్రామపంచాయతీల్లో అభివృద్ధి పనులను పరిశీలించారు. బి.ఎన్. తండాలో పంటకుంటలు, గార్లఓడ్డులో ప్లాంటేషన్లు, ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని తనిఖీ చేశారు. రేపల్లెవాడ గ్రామపంచాయతీ పరిధిలో నిర్మాణంలో ఉన్న విలేజ్ ఆర్గనైజేషన్ (వీఓ) భవనాన్ని పరిశీలించి నిర్మాణ పురోగతి, మౌలిక వసతులపై ఆరా తీశారు. భవనాన్ని ప్రజలకు ఉపయోగపడేలా త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

అనంతరం గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళికల అమలుపై సమీక్ష నిర్వహించి, గడువులోగా నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. పింఛన్లు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేకుండా పనిచేయాలని సూచించారు. పర్యటనలో ఎంపీడీవో భాగ్యశ్రీ, ఎంపీవో జి.వి.ఎస్. నారాయణ, డీఎల్పీవో విజయలక్ష్మి, ఏపీడీ చలపతి, పంచాయతీ సర్పంచ్లు,కార్యదర్శులు తదితర అధికారులు పాల్గొన్నారు.

## కంటి శస్త్రచికిత్స అనంతరం మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన బీఆర్ఎస్ శ్రేణులు ..



**ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న సర్పంచ్.. చాపల మడుగు వీరబాబు**

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని : ఖమ్మం జిల్లా నేరడ గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మంకెన రమేష్ ఇటీవల కంటి శస్త్రచికిత్స చేయించుకోవడంతో తిరుమలాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు శుక్రవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా పరామర్శించారు.

ఈ సందర్భంగా మంకెన రమేష్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న సర్పంచ్ వీరబాబు, ఆయన త్వరగా పూర్తిస్థాయిలో కోలుకుని మునుపటిలాగే ప్రజాసేవలో చురుకుగా కొనసాగాలని ఆకాంక్షించారు. వైద్యుల సూచనలు పాటిస్తూ తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. పార్టీ అభివృద్ధికి, ప్రజా సేవకు మంకెన రమేష్ అందించిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు.

ఈ పరామర్శ కార్యక్రమంలో తిరుమలాపురం గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గోగుల నరసింహారావు, ఉస్మానియా యూనివర్సిటీ బీసీ విద్యార్థి నాయకుడు గోదా రవీందర్, బీఆర్ఎస్ యువజన విభాగం గ్రామ అధ్యక్షుడు బండి సైదులు, బీసీ సెల్ గ్రామ అధ్యక్షుడు మడిపల్లి సైదులు, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు మరీదు మధు, బీఆర్ఎస్ గ్రామ కోశాధికారి గోదా ప్రసాద్, పార్టీ కార్యకర్తలు చింతల రామకృష్ణ, మడిపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొని మంకెన రమేష్‌కు ధైర్యం చెప్పారు.

## ఘనంగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

**నవజాత శిశువులకు తల్లిపాలే అమృతం.సిడిపిఓ,సర్పంచ్...**



**మల్దకల్ ఆగస్టు 7 :** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం పవనంపల్లి.

గ్రామంలోని స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల ముగింపు వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. పవనంపల్లి గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ (×జఋూ) చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (జఋూ) ముఖ్య అతిథిగా హాజరై, పర్యవేక్షించారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ, ప్రతి బిడ్డకు పుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలు (ముర్రుపాలు) అందించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. ముర్రుపాలు బిడ్డకు మొదటి వ్యాధి నిరోధక టీకా లాగా పనిచేసి, భవిష్యత్తులో వచ్చే అనేక వ్యాధుల నుండి రక్షిస్తుందని పేర్కొన్నారు. గ్రామంలోని గర్భిణులు, బాలింతల ఆరోగ్యం మరియు పోషణ విషయంలో పంచాయతీ తరపున పూర్తి సహకారం అందిస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు.

అనంతరం సిడిపిఓ (జఋూ) మాట్లాడుతూ, శిశువు జన్మించిన మొదటి 6 నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టించాలని, నీరు లేదా ఇతర ఆహార పదార్థాలు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం గర్భిణులకు, బాలింతలకు అందిస్తున్న బలామృతం, గుడ్లు, పాలు వంటి పౌష్టికాహారాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తల్లులు పిల్లలకు పాలు పట్టేటప్పుడు తీసుకోవాల్సిన సరైన జాగ్రత్తలు, పోషకాల ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్వైజర్, అంగన్‌వాడీ టీచర్లు, ఆయా, ఆశా కార్యకర్తలు, గ్రామ వార్డు సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో గర్భిణులు, బాలింతలు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## రాయపర్తి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీసీపి

- రికార్డులు, రిసెప్షన్, కేసుల నిర్వహణపై సమగ్ర పరిశీలన



**రాయపర్తి, సి కే న్యూస్ :** మండల పోలీస్ స్టేషన్‌ను డీసీపీ రాజమహేందర్ నాయక్ ఆకస్మికంగా సందర్శించి స్టేషన్‌లోని వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులు, కేసుల నమోదు విధానం, రిసెప్షన్ నిర్వహణ, ప్రజలకు అందిస్తున్న సేవలు, పెండింగ్ కేసుల వివరాలు, స్టేషన్ పరిశుభ్రత, సిబ్బంది విధి నిర్వహణ తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో నిర్వహిస్తున్న రిజిస్టర్లు, ఇతర అధికారిక పత్రాలను పరిశీలించిన డీసీపీ, రికార్డులను నిబంధనలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ధృవీకరిస్తూ నిర్వహించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడంతో పాటు, వారి ఫిర్యాదులను వెంటనే స్వీకరించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో ఏసీపీ అంబటి నర్సయ్య, సీఐ కొమ్మూరి శ్రీనివాసరావు, స్థానిక ఎస్సై ముత్యం రాజేందర్‌తో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## చలో జలవిహార్’ను విజయవంతం చేయాలి

- ప్రైవేట్ వర్సిటీల్లో రిజర్వేషన్ల కోసం పోరాటం కొనసాగుతుంది



**సీకే న్యూస్ ఖమ్మం ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఆగస్టు 08 2026:** ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు అమలయ్యే వరకు ఉద్యమం కొనసాగుతుందని సేవాలాల్ సేన ఖమ్మం జిల్లా అధ్యక్షుడు భుక్యా నరసింహారావు అన్నారు. ఏన్కూరులో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భుక్యా సంజీవ్ నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు హుసేన్ నాయక్ పిలుపు మేరకు ఈ నెల 13న హైదరాబాద్‌లోని జలవిహార్‌లో నిర్వహించే ‘చలో జలవిహార్’ రౌండ్‌టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.
ప్రైవేట్ వర్సిటీల విస్తరణతో బహుజన విద్యార్థుల విద్యా అవకాశాలు దెబ్బతింటున్నాయని, విద్యలో సామాజిక న్యాయం కోసం రిజర్వేషన్లు తప్పనిసరిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా నుంచి విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో జలవిహార్ కార్యక్రమానికి హాజరై ఉద్యమానికి మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు.
సమావేశంలో జిల్లా కన్వీనర్ భుక్యా వినోద్‌కుమార్ రాథోడ్, కో-కన్వీనర్ ఇస్లావత్ చందు నాయక్, జిల్లా కన్వీనర్ బానోత్ రమేష్, ఏన్కూరు మండల అధ్యక్షుడు బోడ ప్రవీణ్ నాయక్, కొణిజర్ల మండల అధ్యక్షుడు లకావత్ దేవేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## విత్తన డీలర్లతో అత్యవసర సమావేశం



**ఆగష్టు 7 సికే న్యూస్ మహబూబాబాద్ జిల్లా (పతినిధి:మురళి :**మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని ఎరువుల డీలర్లతో నిర్వహించిన సమావేశంలో హీూా జక్కుల ఉదయ్ మాట్లాడుతూ ఆగస్టు 20 నుంచి అమలులోకి రానున్న ఖీ.ఖీ.ూ యాప్పై డీలర్లకు అవగాహన కల్పించారు. నిషేధిత పారాక్వాట్ మందు నిల్వ ఉంచినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఎం.ఆర్.పీ. కంటే ఎక్కువ ధరకు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని తెలిపారు. అధిక ధరలకు విక్రయిస్తే రైతులు వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు

## పోగొట్టుకున్న ఫోన్లను బాధితులకు అప్పగించిన పోలీసులు...

**మల్దకల్ ఆగస్టు 7 :** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో పోగొట్టుకున్న మూడు మొబైల్ ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో గుర్తించిన మల్దకల్ పోలీసులు, వాటిని బాధితులకు శుక్రవారం తిరిగి అప్పగించారు.



ఈ సందర్భంగా ఎస్సై కొండ శ్రీహరి మాట్లాడుతూ, మొబైల్ ఫోన్ పోయిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. ఫిర్యాదుల ఆధారంగా సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో మొబైల్ ఫోన్లను గుర్తించి వాటిని యజమానులకు తిరిగి అందజేస్తున్నట్లు తెలిపారు.
ప్రజల ఆస్తుల రక్షణకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, ఎలాంటి సమస్య వచ్చినా నిర్భయంగా పోలీసులను ఆశ్రయించాలని ఆయన కోరారు.
తమకు పోయిన మూడు మొబైల్ ఫోన్లు తిరిగి లభించడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేస్తూ మల్దకల్ పోలీసులకు, ఎస్సై కొండ శ్రీహరికి కృతజ్ఞతలు తెలిపారు.

## గోదా అనంత రాములను పరామర్శించిన తిరుమలాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు.

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి..**చింతకాని మండల పరిధిలోని తిరుమలాపురం గ్రామానికి చెందిన గోదా అనంత రాములు ఈ నెల 4వ తేదీన వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కాలుజారి పడటంతో కాలు ఎముకకు తీవ్ర గాయమైంది. వెంటనే కుటుంబ సభ్యులు ఆయనను ఖమ్మం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం అక్కడ మెరుగైన వైద్య చికిత్స పొందుతున్నారు.
ఈ విషయం తెలుసుకున్న తిరుమలాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు ఈరోజు ఆసుపత్రికి వెళ్లి గోదా అనంత రాములను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, ధైర్యం చెబుతూ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.
ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చిన సర్పంచ్ చాపలమడుగు వీరబాబు, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.
ఈ పరామర్శ కార్యక్రమంలో తిరుమలాపురం రిటైర్ హెడ్



మాస్టర్ బాబురావు, గోగుల నరసింహారావు, బండి సైదులు, మడిపల్లి రామకృష్ణ, గోదా ప్రసాద్, మరీదు మధు, మడిపల్లి సైదులు, చింతల రామకృష్ణ, బంధువులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఇందిరా డైరీని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలి





- డైరీ ఏపిఎం లక్ష్మణరావు
- మత్కేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**చింతకాని మండల కేంద్రంలోని రైతు వేదికలో వెలుగు ఆధ్వర్యంలో, డైరీ ఏపీఎం లక్ష్మణరావు అధ్యక్షతన ఇందిరా డైరీ పథకానికి సంబంధించి మైనార్టీ లబ్ధిదారుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మత్కేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.
ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ, ఇందిరా డైరీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క మానస పుత్రిక అని , భట్టి విక్రమార్క గారు డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న సమయంలోనే బోనకల్ మండల కేంద్రంలో ఇందిరమ్మ డైరీకి రూపకల్పన చేశారని తెలిపారు. మహిళల ఆర్థికాభివృద్ధి, సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.
చింతకాని మండలంలోని సుమారు 4 వేల మంది మహిళా సభ్యులకు ఇందిరా డైరీ పథకం ద్వారా సబ్సిడీపై గేదెలను అందించి, వారి ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుండటం అభినందనీయమన్నారు. ఇందిరా డైరీ ద్వారా మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలన్నారు
ప్రభుత్వం ద్వారా గేదెలను పొందిన డ్వాక్రా మహిళలు వాటిని విక్రయించకుండా, గేదెల ద్వారా లభించే పాల ఉత్పత్తులను విక్రయిస్తూ ఆదాయం పెంచుకోవాలని తద్వారా తమ కుటుంబాల ఆర్థిక అవసరాలను తీర్చుకోవడంతో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. మహిళా సాధికారతే రాష్ట్ర ప్రగతికి బలమైన పునాది అని ,మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ప్రతి మహిళ ఆత్మవిశ్వాసంతో ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకు సాగాలని అంబటి అకాంక్షించారు .
ఈ శిక్షణ కార్యక్రమంలో అధికారులు పాడి పరిశ్రమపై అవగాహన కల్పించడంతో పాటు ఆధునిక పశుపోషణ పద్ధతులు, పశువుల ఆరోగ్య సంరక్షణ, మేత నిర్వహణ, పాల ఉత్పత్తి పెంపు తదితర అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. లబ్ధిదారులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఆచరణలో పెట్టి, పశువుల సంరక్షణలో మెరుగైన పద్ధతులను పాటిస్తూ అధిక పాల ఉత్పత్తి సాధించాలని, తద్వారా కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవాలని అధికారులు సూచించారు.
ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కన్నెబోయిన గోపి యదవ్, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షులు మదుపల్లి భాస్కరరావు, జిల్లా ఆత్మ కమిటీ డైరెక్టర్ కొప్పల గోవిందరావు, వ్యవసాయ శాఖ ఏ.డీ. వాణిశ్రీ, చింతకాని వెటర్నరీ డాక్టర్ రాంజీ, నాగులవంచ వెటర్నరీ డాక్టర్ శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ వెటర్నరీ అధికారి పండగ బాబు, వెటర్నరీ డాక్టర్ నరసింహ, వెలుగు సీసీలు, డ్వాక్రా గ్రూప్ సభ్యులు, ఇందిరా డైరీకి ఎంపికైన మైనార్టీ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సుభక్షంగా ఉండాలని శివయ్యకు పూజలు.

**పొద్దుటూరు పురాతన శివాలయం లో శ్రీ ఆదిపరాశక్తి భక్త బృందం ప్రత్యేక పూజలు.**

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామంలోని సుమారు 200 సంవత్సరాలు క్రితం చరిత్ర కలిగిన పురాతన
శివాలయంలో జోరున వర్షం కురుస్తున్న కూడా ప్రొద్దుటూరు గ్రామంలోని శ్రీ ఆదిపరాశక్తి అమ్మవారి భక్త బృందం సభ్యులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఆ పరమేశ్వరుడి దివ్య ఆశీస్సులతో ఆ శివయ్య మహిమతో గ్రామం మొత్తం సుభిక్షంగా ఉండాలని గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో పాడిపంటలతో తులతూగుతూ ఉండాలని వేడుకుంటూ ఘనంగా పురాతన శివాలయం దగ్గర పూజా కార్యక్రమాలు మంగళ హారతి నిర్వహించడం జరిగినది అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదములను భక్తులకు అందించి ఆ స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని



కోరుకోవడం జరిగినది ఈ కార్యక్రమంలో శ్రీ ఆదిపరాశక్తి భక్త బృందం సభ్యులు మరియు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## ఘనంగా మల్దకల్ జూనియర్ కళాశాలలో...





**మల్దకల్ ఆగస్టు07:** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నేడు ప్రిన్సిపాల్ శ్రీలత రెడ్డి అధ్యక్షత న అధ్యాపకులు మరియు విద్యార్థులు ఘనంగా మెహందీ ఉత్సవం నిర్వహిస్తూ.. ఈ సందర్భంగా ముఖ్యంగా విద్యార్థినిలు ఇంటిదగ్గర ఇష్టపూర్వకంగా తయారుచేసిన గోరింటాకుతో వారి చేతులకు అలంకరించుకుని ఆటాపా టాలతో ఉత్సాహపరిచారు .ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఆషాడ మాసంలో ముఖ్యంగా స్త్రీలు చేసుకుని చాలా ఆనందంగా గోరింటాకులు చేసుకొని వారి చేతులు అలంకరించుకొని కుటుంబ సభ్యులు బంధువులు స్నేహితులతో ఉత్సాహాన్ని పంచుకుంటారుఅని అన్నారు. మరియు ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో ఇదే సందర్భంలో బోనాల పండుగ కూడా ఉత్సా భరితంగా– జరుపుకుంటారని సూచించారు .ఈ కార్యక్రమంలో అధ్యాపకులు భాగ్యలక్ష్మి, మాధురి ,రామాంజనేయులు గౌడ్ ,నరసింహులు, గోవర్ధన్ శెట్టి, శ్రీకాంత్ ,రంగస్వామి , ఇష్తికర్ అహ్మద్ మరియు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొ న్నారు.

## అంగన్వాడి కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాలు.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**చింతకాని మండలం, బస్వాపురం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గ్రామ సర్పంచ్ ఆవుల నరసింహారావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.
గ్రామ సర్పంచ్ ఆవులు నరసింహారావు మాట్లాడుతూ, తల్లిపాలను నిర్లక్ష్యం చేయడం వల్ల శిశువులో పోషకాహార లోపం, తరచూ అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి తల్లి తన బిడ్డకు తల్లిపాలు అందించి ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ సూపర్వైజర్ కే పుణ్యవతి స్కూల్ హెచ్‌ఎం ఇందిరా గ్రామ కార్యదర్శి రామకృష్ణ అంగన్వాడి టీచర్ అనూష హెల్పర్ ఆశీ ది కృష్ణవేణి ఆశ వర్కర్ మార్గం కృష్ణవేణి జక్కులు జానమ్మ వివో లోయర్ రేణుక గ్రామ పెద్దలు గర్భిణీలు తల్లులు తదితరులు పాల్గొన్నారు

## అంగన్వాడి కేంద్రంలో 1 ప్రపంచ తల్లిపాలు వార్షికోత్సవాలు



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామంలోని అంగన్వాడి 1 కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి మీూనూ డాక్టర్ మధుమయి మాట్లాడుతూ తరచూ తల్లిపాలను నిర్లక్ష్యం చేయడం వల్ల శిశువులో వచ్చే ఆరోగ్య సమస్యలు వాటి వలన కలిగే ఇబ్బందులను గురించి వివరించడం జరిగినది ప్రతి తల్లి తన బిడ్డలకు తల్లిపాలను అందించి ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు పునాదులు వేయాలని కోరారు తల్లిపాల ప్రాముఖ్యత శిశువు ఆరోగ్య సంరక్షణ తల్లిపాల వలన కలిగే ప్రయోజనాలు గురించి అవగాహన కల్పించడం జరిగినది శిశువుకు తల్లిపాలు అత్యుత్తమమైన ఆహారమని మొదటి ఆరు నెలలు తల్లిపాలు బిడ్డకు మాత్రమే అందించాలని కోరారు అనంతరం అంగన్వాడీ 1 కేంద్రంలో ఉన్న చిన్నారులకు నూతన అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమంలో డాక్టర్ మధుమయి ఏఎన్ఎం సరళ ఆశా కార్యకర్తలు అంగన్వాడీ టీచర్లు శ్రీమతి నిర్మలా శ్రీమతి ఉమా శ్రీమతి సులోచన గారు చిన్నారుల తల్లిదండ్రులు గ్రామస్తులు పాల్గొన్నారు

# 59 నియోజకవర్గాల్లో బీసీల రాజ్యాధికార పోరు..

- "సర్జికల్ స్ట్రైక్-59"తో తీన్మార్ మల్లన్న సంచలనం
- కత్తెర గుర్తుతో అగ్రవర్ణాల రాజకీయ గుత్తాధిపత్యానికి చెక్...
- 2028లో బీసీల రాజ్యాధికారమే లక్ష్యం
- టీఆర్పీ చీఫ్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



**సి కె న్యూస్ ప్రతినిధి:** హైదరాబాద్: తెలంగాణలో రెడ్డి, వెలమ, కమ్మ సామాజిక వర్గాల రాజకీయ ఆధిపత్యానికి ముగింపు పలికి బీసీలకు రాజ్యాధికారం సాధించాలనే లక్ష్యంతో తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న "సర్జికల్ స్ట్రైక్–59" కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్మూర్, బోధన్, నిర్మల్, బాన్సువాడ నియోజకవర్గాల ఎన్నికల చరిత్ర, ఓటర్ల గణాంకాలు, ప్రజాప్రతినిధుల వివరాలను వెల్లడిస్తూ బీసీలు రాజకీయంగా ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు.

**ఆర్మూర్: 14 సార్లు రెడ్డి ఎమ్మెల్యేలే**

1952 నుంచి ఆర్మూర్‌లో జరిగిన 16 ఎన్నికల్లో 14 సార్లు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారే ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారని మల్లన్న తెలిపారు. ఎం. నారాయణ రెడ్డి, ఎ. శ్రీనివాస్ రెడ్డి, జీవన్ రెడ్డి, ఏ. ఆశన్నగారి జీవన్ రెడ్డి వంటి నాయకులు ఎక్కువ కాలం ప్రాతినిధ్యం వహించారని పేర్కొన్నారు. కేవలం జి. రాజారాం (1952), బాజిరెడ్డి గోవర్ధన్ (1999) మాత్రమే బీసీ వర్గానికి చెందిన ఎమ్మెల్యేలుగా గెలిచారని చెప్పారు. మొత్తం 2,10,341 ఓట్లలో బీసీలు 1,35,999 మంది ఉండగా, రెడ్లు కేవలం 7,984 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు.

**బోధన్: బీసీల ఓట్లు.. అధికారంలో రెడ్లే**

బోధన్‌లో ఎం. నారాయణ రెడ్డి, పి. సుదర్శన్ రెడ్డి, షకీల్ అహ్మద్ వంటి నాయకులు వరుసగా అధికారాన్ని అనుభవించారని మల్లన్న పేర్కొన్నారు. 2,20,238 ఓట్లలో బీసీలు 1,42,401 మంది ఉండగా, రెడ్లు కేవలం 8,360 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. అయినా బీసీలు రాజకీయంగా వెనుకబడటం బాధాకరమన్నారు.

**నిర్మల్: ఇంద్రకరణ్ రెడ్డి -- మహేశ్వర్ రెడ్డి రాజకీయాలే**

నిర్మల్ నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు ఒక్క బీసీ ఎమ్మెల్యే కూడా గెలవలేదని మల్లన్న అన్నారు. అల్లోల్ల ఇంద్రకరణ్ రెడ్డి, ఏలేటి మహేశ్వర్ రెడ్డి వంటి నాయకులే పార్టీలు మారుతూ అధికారాన్ని పంచుకున్నారని విమర్శించారు. మొత్తం 2,53,551 ఓట్లలో బీసీలు 1,54,159 మంది ఉండగా, రెడ్లు కేవలం 7,237 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు.

**బాన్సువాడ: పోచారం కుటుంబ ఆధిపత్యంపై విమర్శ**

బాన్సువాడలో పోచారం శ్రీనివాస్ రెడ్డి కుటుంబ రాజకీయాలకు 2028లో ముగింపు పలకాలని మల్లన్న పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు టికెట్ ఇవ్వకుండా ఇతర నియోజకవర్గం నుంచి రెడ్డి అభ్యర్థిని తీసుకురావడంతో బీసీ నాయకుడు కాసుల బాలరాజు ఆత్మహత్యాయత్నం చేసిన ఘటనను గుర్తు చేశారు. మొత్తం 1,95,384 ఓట్లలో బీసీలు 1,24,439 మంది (63 శాతం) ఉండగా, రెడ్లు కేవలం 8,697 మంది మాత్రమే ఉన్నారని వివరించారు.

**59 స్థానాల్లో కోటి మంది బీసీలు.. 8 లక్షల అగ్రవర్ణ ఓట్లు**

సర్జికల్ స్ట్రైక్–59 పరిధిలోని 59 నియోజకవర్గాల్లో సుమారు 96.59 లక్షల మంది బీసీ ఓటర్లు ఉన్నారని, రెడ్డి, వెలమ, కమ్మ సామాజిక వర్గాల ఓటర్లు కలిపి 8 లక్షలకు కూడా చేరుకోరని మల్లన్న పేర్కొన్నారు. అయినప్పటికీ ఈ 59 స్థానాల్లో అగ్రవర్ణాలకే ప్రాతినిధ్యం దక్కడం సామాజిక న్యాయానికి విరుద్ధమని అన్నారు.

2028 ఎన్నికల్లో ఈ 59 నియోజకవర్గాల్లో బీసీల రాజకీయ చైతన్యాన్ని పెంచి రాజ్యాధికార పార్టీ జెండా ఎగురవేయడమే లక్ష్యమని, "బీసీల ఓట్లతోనే బీసీల రాజ్యాధికారం సాధిస్తాం" అని టీఆర్పీ చీఫ్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న స్పష్టం చేశారు.

రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 59 స్థానాల్లో రెడ్డి, వెలమ, కమ్మ సామాజిక వర్గాలు రాజకీయ అధికారాన్ని గుప్పెట్లో పెట్టుకున్నాయని పేర్కొంటూ, ఆ గుత్తాధిపత్యాన్ని 'కత్తెర' గుర్తుతో కత్తిరించడమే తెలంగాణ రాజ్యాధికార పార్టీ లక్ష్యమని ప్రకటించారు.

**కత్తెర గుర్తు... బీసీల రాజ్యాధికార ప్రతీక**

తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎన్నికల గుర్తు 'కత్తెర' కేవలం ఒక గుర్తు కాదని, అగ్రవర్ణాల రాజకీయ గుత్తాధిపత్యాన్ని కత్తిరించే ఆయుధమని మల్లన్న పేర్కొన్నారు. బీసీలను అనుచరులుగా, జెండాలు మోసే కార్యకర్తలుగా ఉంచిన రాజకీయ వ్యవస్థను ఛేదించి, వారిని ఎమ్మెల్యేలుగా, పాలకులుగా తీర్చిదిద్దడమే ఈ గుర్తు ఉద్దేశ్యమని వివరించారు.

**'బిగ్ క్లాస్' సిద్ధాంతంతో కొత్త రాజకీయ నినాదం**

బీసీలు సంఖ్యాపరంగా రాష్ట్రంలో అతిపెద్ద రాజకీయ శక్తి అని, అందుకే వారిని 'బిగ్ క్లాస్' గా అభివర్ణిస్తున్నామని మల్లన్న చెప్పారు. ఇతర వర్గాల ఓట్లపై ఆధారపడాల్సిన అవసరం లేదని, బీసీల ఓట్లే అధికారాన్ని నిర్ణయించగలవని స్పష్టం చేశారు.

**బీసీ నాయకులకు పిలుపు**

ఇతర పార్టీల్లో జెండాలు మోసే కార్యకర్తలుగా కాకుండా, చట్టసభల్లో ప్రజలకు ప్రాతినిధ్యం వహించే నాయకులుగా ఎదగాలని బీసీ యువతకు, నాయకులకు మల్లన్న పిలుపునిచ్చారు. బి-ఫామ్‌ల కోసం అగ్రవర్ణ పార్టీల చుట్టూ తిరిగే రోజులు ముగియాలని, సొంత పార్టీ ద్వారా రాజకీయ భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు.

**బి-ఫామ్‌లపై విమర్శలు**

కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు బీసీలను కేవలం ఓటర్లుగానే ఉపయోగించుకుని, ఎమ్మెల్యే టికెట్లు మాత్రం తమ సామాజిక వర్గాలకే ఇస్తున్నాయని మల్లన్న ఆరోపించారు.

**2028 లక్ష్యం... 59 స్థానాల్లో బీసీ జెండా**

2028 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ 59 నియోజకవర్గాల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ విజయకేతనం ఎగరవేసి బీసీల రాజ్యాధికారాన్ని స్థాపించడమే లక్ష్యమని మల్లన్న తెలిపారు. ఇది కేవలం ఎన్నికల పోరాటం కాదని, బీసీల ఆత్మగౌరవ ఉద్యమమని పేర్కొన్నారు.

**బీసీ ప్రభుత్వం వస్తే...**

బీసీ ప్రభుత్వం ఏర్పడితే ప్రభుత్వ కార్యాలయాల్లో సామాన్య ప్రజలకు గౌరవప్రదమైన సేవలు అందుతాయని, పైరవీలు, సిఫార్సుల రాజకీయాలకు ముగింపు పలుకుతామని మల్లన్న అన్నారు. ప్రజా కేంద్రిత పరిపాలనను తీసుకురావడమే తమ సంకల్పమని స్పష్టం చేశారు.

## సర్పంచ్ చిటమ్మా భర్త గోపాల్ ని మాజీ ఎంపీపీ గోవింద్ ని పరామర్శించిన...

-౨+ూా+ణజఖీూ చైర్ పర్సన్ సరిత తిరుపతయ్య ...



**మల్దకల్ ఆగస్టు 7:** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల సర్పంచ్ చిటమ్మా భర్త గోపాల్ ప్రమాదవశత్తు కిందపడి చెయ్ ఫ్రాక్చర్ అయింది మరియు మాజీ ఎంపీపీ గోవింద్ బైక్ మీదనుండి కిందపడి కాలు ఫ్రాక్చర్ అయింది వారిద్దరినీ ఈరోజు మాల్దాకల్ లో వారి ఇంటికి వెళ్లి పరామర్శించిన సరితమ్మ...

వారితో పాటు.. పెద్దపల్లి సర్పంచ్ శిరీష రాజశేఖరరెడ్డి,డీసీసీ జనరల్ సెక్రటరీ లక్ష్మణ్, గద్వాల మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మాల్దాకల్ ఉపసర్పంచ్ సత్యమ్మ ఆంజనేయులు, మాల్దాకల్,మంగంపేట సర్పంచ్ వెంకటేష్, మాజీ ఎంపీటీసీ తిమ్మప్ప కిష్టన్నా, అయ్యప్ప, పెద్దపల్లి ఉప సర్పంచ్ నర్సింహులు, నాగన్న, జయనందం, కొండపగు యేసేబు, అమృత్, మళ్ళిగౌడ్, పరుశరాముడు, దోని ఆంజనేయులు, ముఖ్య నాయకులు తదితరులు ఉన్నారు.

## ఎన్ఎస్పీ క్వార్టర్స్‌లో ఉచిత వైద్య శిబిరం



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని: మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలోని ఎన్ఎస్పీ క్వార్టర్స్‌లో నాగులవంచ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు.ప్రజలు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు.ఈ కార్యక్రమంలో నాగులవంచ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వేణుమాధవ్, ఏఎన్ఎంలు సుజాత, నర్సమ్మ, ఆయాలు తదితరులు, పాలుగోన్నారు.

## ప్రజల చిరకాల కోరిక నెరవేరింది. నూతన ఆర్టీసీ బస్సుకు పచ్చజెండా...



**మల్దకల్ ఆగస్టు 7 :** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం నీలిపల్లి గ్రామ ప్రజల చిరకాల కోరిక నెరవేరింది. నీలిపల్లి గ్రామానికి నూతన ఆర్టీసీ బస్సు సేవలను ప్రారంభించారు.

ఈ బస్సు సేవలతో విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, గ్రామ ప్రజలకు రాకపోకలు మరింత సులభం కానున్నాయి. బస్సు ప్రారంభం కావడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తూ, ఈ సౌకర్యం కల్పించిన అధికారులకు మరియు ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ కె. విష్ణు, గ్రామ పెద్ద ఆంజనేయులు, వార్డు సభ్యులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళ్ళ అద్దాలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ పర్చ రామచంద్రరావు



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** వత్సవాయి మండలం పోలంపల్లి గ్రామంలో జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి వైద్యం చేసుకున్న వారికి ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా చిన్న మండవ గ్రామ సర్పంచ్ పర్చ రామచంద్రరావు పాల్గొన్నారు, ఈ సందర్భంగా జయప్రద ఫౌండేషన్ వారు చిన్నమండవ సర్పంచ్ పర్చ రామచంద్ర రావు ని సన్మానించడం జరిగింది..

## ఈనెల 8 నుండి జరిగే 48వ చాతుర్మాస్య మహోత్సవాలకు రాష్ట్ర చైర్ పర్సన్ సరితమ్మ కు ఆహ్వానించిన



**చింతరేవుల ఆలయ పురోహితులు...**

**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :** జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల పరిధిలోని పెద్ద చింతరేవుల గ్రామము నందు 18వ శతాబ్దంలో వెలసిన శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానము శ్రీ వ్యాసరాయలచే ప్రతిష్ఠించబడి శ్రీ శేషదాసుల వారిచే బహిర్గతమైన శ్రీ ఆంజనేయస్వామి సన్నిధానము నందు శ్రీశ్రీశ్రీ 1008 శ్రీ విద్యాధీశ తీర్థ శ్రీపాదుల వారు మరియు శ్రీశ్రీశ్రీ 1008 శ్రీ విద్యారాజేశ్వర తీర్థ శ్రీపాదుల వారు పలిమారు మఠం,ఉడిపి పీఠాధిపతుల 48వ చాతుర్మాస్య మహోత్సవములు

ఈనెల 08 నుంచి సెప్టెంబర్ 25 వరకు జరిగే మహోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గొర్రెల, మేకల సహకార కార్పొరేషన్ చైర్ పర్సన్ సరితమ్మకి ఆలయ అర్చకులు ధరూర్ కిష్టచార్యులు మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు...

ఈ కార్యక్రమంలో చింతరేవుల ఆంజనేయస్వామి ఆలయ అర్చకులు కిష్టచార్యులు,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ లత్తిపురం వెంకట్రామిరెడ్డి,మాజీ సింగిల్ విండో చైర్మన్ సీసాల వెంకట్ రెడ్డి, పటేల్ శ్రీనివాసులు, చింతరేవుల సురేష్,గోనుపాడ్ శ్రీనివాస్ గౌడ్, గుడ్డెందొడ్డి నర్సింహులు,రామకృష్ణ, రాములు తదితరులు ఉన్నారు

## సర్పంచ్ ఆశీర్వాదం ఆధ్వర్యంలో తాగునీటి నల్లాల పనులు...



**గట్టు మండలం ఆగస్టు 7:** జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం తప్పట్లు మొరుస్ గ్రామంలో తాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు ఇంటింటి నల్లా కొళాయిల పనులను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. సర్పంచ్ ఆశీర్వాదం పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తూ, నిరంతరాయంగా నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. గ్రామంలోని ప్రతి లబ్ధిదారునికి తాగునీరు అందాలన్నదే తమ ధ్యేయమని సర్పంచ్ పేర్కొన్నారు. అధికారుల సమన్వయంతో పనులను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తెస్తామని వివరించారు.

## అడేల్లి పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్న గౌరవ బోత్ మీూూ శ్రీ. అనిల్ జాదవ్ గారు..!!



**బోథ్ సి కె న్యూస్......** ఈ రోజులు నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలో ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ. మహా అడెల్లి పోచమ్మ అమ్మవారిని దర్శించుకొన్న గౌరవ బోత్ మీూా శ్రీ. అనిల్ జాదవ్ గారు.!!


అనంతరం జేజుజు మెయిన్ లో అల్ ఇండియా 461 ర్యాంక్ సాధించిన సందర్భంగా తలమడుగు మండలంలోని చర్లపల్లి గ్రామానికి చెందిన పబ్బు అశోక్ కుమారుడు పబ్బు వ్రతంను సన్మానించి శుభాకాంక్షలు తెలిపి అభినందించిన గౌరవ బోత్ మీూా శ్రీ. అనిల్ జాదవ్ గారు వీరితో పాటు తలమడుగు పాక్స్ చైర్మన్ ఎల్మా శ్రీనివాస్ రెడ్డి, స్థానిక సర్పంచ్ అశోక్, కార్తీక్ రెడ్డి, గంగారెడ్డి, మాజీ అడెల్లి చైర్మన్ లక్ష్మినారాయణ తదితరులు ఉన్నారు..!!




**సి కె న్యూస్ ప్రతినిది ఖమ్మం, ఆగస్టు 7 :**
ఆందోళనలు, ఒత్తిళ్లతో నిండిన దైనందిన జీవితంలో కాసేపు మనసును తేలికపరిచి, చిరునవ్వుల ఊయలలూగించేందుకు ఖమ్మం నగరం ఒక వర్ణరంజిత వేదికగా మారింది. చిన్నారుల కేరింతలు, పెద్దల ఆనంద భాష్పాలతో హృదయాలను ఆహ్లాదపరిచే వినోదాల హరివిల్లు బటర్ ఫ్లై ఎగ్జిబిషన్ ఖమ్మం నగరంలోని పెవిలియన్ గ్రౌండ్‌లో రూపుదిద్దుకుంది. ఎస్.కె ట్రేడ్ ఫెయిర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 'బటర్ ఫ్లై ఎగ్జిబిషన్' ఈనెల 7 నుంచి ఆగస్టు 30వ తేదీ వరకు నగరవాసులకు అపరిమిత ఆనందాన్ని పంచడానికి సిద్ధమైంది. ఖమ్మం నగరంలో పెవిలియన్ గ్రౌండ్ బటర్ ఫ్లై ఎగ్జిబిషన్ ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో ముఖ్య నిర్వాహకులు గరిమెళ్ల జానకిరామయ్య మాట్లాడుతూ... ఈ ఎగ్జిబిషన్ కేవలం ఆటపాటల ప్రదర్శన మాత్రమే కాదు, బాధ్యతల భారంతో అలసిపోయిన మనసులకు ఆనందాన్ని, కొత్త ఉత్సాహాన్ని అందించే ఒక హృదయపూర్వకమైన వేదిక అవుతుందన్నారు. ప్రతి ఒక్కరి బంధాలను మరింత బలపరిచేలా, ఆహ్లాదకర వాతావరణంలో అమూల్యమైన జ్ఞాపకాలను అందిస్తుందన్నారు. సకుటుంబ సమేతంగా గడిపే ప్రతి మధురక్షణం మనిషి ఆయుష్షును కూడా పెంచుతుందన్నారు. ఆత్మీయుల కలయిక, పసిపిల్లల నవ్వులు మానసిక ప్రశాంతతను అందించి ఆరోగ్యానికి కొత్త ఊపిరి పోస్తాయన్నారు. పిల్లల ముఖాల్లో విరిసే నవ్వులే ఈ సమాజానికి అసలైన అందం అన్నారు. చిన్నారుల ఆనందాన్ని రెట్టింపు చేసేందుకు ఇలాంటి ఎగ్జిబిషన్లు గొప్ప ఆకర్షణీయంగా నిలుస్తాయన్నారు. వచ్చే వారం నుంచి 14 ఏళ్ల లోపు విద్యార్థులకు ఉచిత ఎంట్రీ పాసుల సౌకర్యాన్ని కల్పిస్తున్నామన్నారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా స్వయంగా ఆయా పాఠశాలల గుమ్మాల వద్దకు వెళ్లి విద్యార్థులకు ఉచిత ప్రవేశ పాసులను అందజేసి, చిన్నారుల హృదయాల్లో ఆనందాల వెలుగులు నింపనున్నామన్నారు.
ఆర్థికభారం కాకుండా సామాన్యుడికి కూడా పూర్తిస్థాయి వినోదం అందాలనే ఉద్దేశంతో, ప్రవేశ రుసుమును కేవలం రూ. 50 లుగా నిర్ణయించామన్నారు. ఈ ప్రదర్శనలో సరికొత్తగా ఏర్పాటుచేసిన 'రోబోటిక్ బటర్ ఫ్లై' పరికరం ప్రతి ఒక్కరినీ విస్మయానికి గురిచేస్తూ ప్రత్యేక

ఆకర్షణగా నిలవనుందన్నారు. ?దీంతో పాటు సందర్శకులను మంత్రముగ్ధులను చేసే 12 అద్భుతమైన విభాగాలు అలరించడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. జాయింట్ వీల్, బ్రేక్ డాన్స్, సలాంబో, కొలంబస్, తోరా.. తోరా, ?కుటుంబ సమేత వినోదాలు : డ్రాగన్ ట్రైన్, మహారాజా ట్రైన్, ?
చిన్నారుల ప్రత్యేక ఆకర్షణలు : వాటర్ బోట్, కార్లు, జంపింగ్, గుర్రాలు, బౌన్సర్ లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఖమ్మం నగర ప్రజలు కుటుంబ సమేతంగా ఈ ఎగ్జిబిషన్ ను సందర్శించి ఆహ్లాదాన్ని ఆస్వాదించాలని ఆయన కోరారు. ఈ విలేకరుల సమావేశంలో అనుబంధ నిర్వాహకులు మొలుగూరి నాగేందర్, శిరీష, షేక్ జాన్బీ తదితరులు పాల్గొన్నారు.

# 'ఏఏ23'- షాహిద్ విలన్‌గా?



'పుష్ప' సిరీస్‌తో గ్లోబల్ గుర్తింపు సంపాదించిన అల్లు అర్జున్, వరుస భారీ ప్రాజెక్టులతో దూసుకెళ్తున్నారు. ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'రాకా' షూటింగ్‌లో బిజీగా ఉన్న బన్నీ, తర్వాత దర్శకుడు లోకేష్ కనగరాజ్‌తో చేయనున్న 'ఏఏ23'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఆసక్తికర వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. కీలకమైన ప్రతినాయకుడి పాత్ర కోసం బాలీవుడ్ స్టార్ షాహిద్ కపూర్ పేరు పరిశీలిస్తున్నట్టు సినీవర్గాల కథనం. సాధారణ గెస్ట్‌రోల్ కాకుండా, హీరోతో సమానంగా తలపడే శక్తివంతమైన పాత్రగా ఉండనుందని టాక్. లోకేష్ కనగరాజ్ సినిమాల్లో ప్రతినాయకుల పాత్రలకు ప్రత్యేక స్థానం ఉంటుంది. 'మాస్టర్'లో విజయ్ సేతుపతి, 'విక్రమ్'లో సూర్య, 'లియో'లో సంజయ్‌దత్, 'కూలీ'లో నాగార్జున వంటి స్టార్ నటులను విభిన్నమైన నెగెటివ్ షేడ్స్‌లో చూపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

అదే తరహాలో ఏఏ23లో కూడా బలమైన, ఇంటెన్స్ విలన్ పాత్రను రూపొందిస్తున్నట్టు సమాచారం. 'కబీర్ సింగ్', 'ఫర్జీ'వంటి ప్రాజెక్టుల్లో నటనతో ప్రశంసలు అందుకున్న షాహిద్ కపూర్, నిజంగానే ఈ చిత్రంలో భాగమైతే ఉత్తరాది మార్కెట్‌లో సినిమాకు మరింత క్రేజ్ పెరిగే అవకాశం ఉందని విశ్లేషకుల అభిప్రాయం. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ దశలో ఉంది. సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ స్వరాలు సమకూరుస్తున్నారు. విదేశీ లొకేషన్లు, భారీ సెట్లలో చిత్రీకరణ చేపట్టనున్నట్టు తెలుస్తోంది. కథ మొత్తం పవర్‌ఫుల్ యాక్షన్, కాన్ఫ్లిక్ట్ డ్రామా చుట్టూ తిరుగుతుందని, హీరోయిన్ పాత్రకు పెద్దగా ప్రాధాన్యం ఉండదన్న ప్రచారం కూడా వినిపిస్తోంది. దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు.

హాట్‌స్టార్!



రాశి సింగ్



## సూపర్‌స్టార్ సరసన..
# కమ్‌బ్యాక్ ఛాన్స్

టాలీవుడ్‌లో వరుస అవకాశాలతో దూసుకెళ్లిన శ్రీలీల, ప్రస్తుతం కెరీర్‌లో కీలక దశను ఎదుర్కొంటోంది. 'ధమాకా' బ్లాక్‌బస్టర్ విజయంతో స్టార్ హీరోయిన్ల జాబితాలో చేరిన ఈ భామ, ఆ తర్వాత నటించిన చిత్రాలు ఆశించిన విజయాలు సాధించకపోవడంతో తెలుగులో అవకాశాలు తగ్గాయి. దీంతో ఆమె ఇతర భాషలపై దృష్టి పెట్టింది - బాలీవుడ్‌లో కార్తీక్ ఆర్యన్ సరసన ఓ భారీ చిత్రంలో అవకాశం దక్కించుకున్న శ్రీలీలకు, తాజాగా కోలీవుడ్ నుంచి మరో ప్రతిష్టాత్మక ఆఫర్ వచ్చినట్టు ప్రచారం సాగుతోంది. సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించనున్న ఓ భారీ పాన్ ఇండియా ప్రాజెక్టులో ఆమెను కథానాయికగా ఎంపిక చేసే దిశగా చర్చలు జరుగుతున్నట్టు తమిళ సినీ వర్గాల సమాచారం. ఈ ప్రాజెక్టు ఖరారైతే, వరుస ఫ్లాపుల తర్వాత రజనీకాంత్ వంటి లెజెండరీ స్టార్ సరసన నటించే అవకాశం శ్రీలీల కెరీర్‌ను గాడిలో పెట్టే ఛాన్స్‌గా భావిస్తున్నారు. ఈ సినిమా విజయవంతమైతే దక్షిణాదితో పాటు బాలీవుడ్‌లోనూ ఆమె క్రేజ్ మరింత పెరిగే అవకాశం ఉంది. వ్యక్తిగతంగా బిజీగా ఉన్న శ్రీలీల, తల్లితో కలిసి దేవాలయాలు సందర్శిస్తూ, ప్రముఖ బ్రాండ్ల ప్రకటనల్లో నటిస్తూ, స్కిన్‌కేర్ వ్యాపారాన్ని కూడా విజయవంతంగా నిర్వహిస్తోంది. తమిళంలో ఇప్పటికే 'పరాశక్తి'తోపాటు ధనుష్ హీరోగా తెరకెక్కుతున్న మరో చిత్రంలోనూ ఆమె నటిస్తోంది. రజనీకాంత్ ప్రాజెక్టు వార్తలు నిజమైతే, శ్రీలీల కెరీర్‌కు ఇది భారీ టర్నింగ్ పాయింట్‌గా మారే అవకాశం ఉందని విశ్లేషకుల అభిప్రాయం. అయితే, దీనిపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన రాలేదు.

# థియేటర్ల నుంచి ఓటీటీకి.. లెనిన్

అక్కినేని అఖిల్ హీరోగా దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరు తెరకెక్కించిన ఎమోషనల్ యాక్షన్ డ్రామా 'లెనిన', ఈ ఏడాది టాలీవుడ్‌లో సంచలన విజయాన్ని అందుకున్న చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. థియేటర్లలో మంచి వసూళ్లు సాధించి అఖిల్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలిచిన ఈ సినిమా కోసం ఓటీటీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూశారు. ఇప్పుడు వారి నిరీక్షణకు తెరపడింది - థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శన జరుపుకున్న అనంతరం, 'లెనిన' చిత్రం ప్రముఖ ఓటీటీ వేదిక జీ5లో స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి వచ్చింది. హీరోయిన్‌గా భాగ్యశ్రీ బోర్సే ఆకట్టుకోగా, దర్శకుడు ఎమోషన్, యాక్షన్ అంశాలను సమతూకంగా మేళవించి ప్రేక్షకులను మెప్పించారు. సంగీత దర్శకుడు ఎస్. థమన్ అందించిన నేపథ్య సంగీతం, పాటలు సినిమాకు మరో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి - ముఖ్యంగా యాక్షన్, ఎమోషనల్ ఎపిసోడ్స్‌లో థమన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌కు మంచి ప్రశంసలు దక్కాయి. అక్కినేని నాగార్జునతో పాటు నిర్మాత నాగవంశీ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం, భారీ అంచనాల మధ్య విడుదలై బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. థియేటర్లలో



ముందుగా ప్రకటించిన సమయం కంటే కొన్ని గంటల ముందే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో ప్రత్యక్షమవడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం తెలుగు వెర్షన్‌లో మాత్రమే స్ట్రీమింగ్ అవుతోండగా, ఇతర భాషల డబ్బింగ్ వెర్షన్లు త్వరలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ చిత్రంలో అఖిల్ అక్కినేని తన కెరీర్‌లోనే భిన్నమైన పాత్రలో కనిపించి నటనతో ప్రశంసలు అందుకున్నారు. మిస్ అయిన ప్రేక్షకులు ఇప్పుడు జీ5 వేదికగా ఇంట్లోనే ఈ చిత్రాన్ని వీక్షించే అవకాశం పొందారు.

# ఏబీ.. 83 ఏళ్లకూ తగ్గని ఎనర్జీ



83 ఏళ్ల వయసులోనూ బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ తన ఎనర్జీ, వృత్తిపట్ల అంకితభావంతో మరోసారి అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రముఖ క్విజ్ షో 'కౌన్ బనేగా కరోడ్‌పతి 18' షూటింగ్ కోసం ఆయన ఏకంగా 24 గంటల పాటు నిరవధికంగా పని చేశారు. మొదటి రోజు ఉదయం 7 గంటలకు ప్రారంభమైన షూటింగ్, మరుసటి రోజు ఉదయం 7 గంటల వరకు ఎలాంటి విరామం లేకుండా కొనసాగింది. కేబీసీ 18 ప్రసార తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో, నిర్ణీత గడువులోగా షూటింగ్ పూర్తి చేయాల్సిన అవసరం ఉండటంతో ఈ సుదీర్ఘ షిఫ్ట్‌లో పాల్గొన్నట్టు ఆయన తన అధికారిక బ్లాగ్‌లో వెల్లడించారు. ఆగస్టు 10 నుంచి కేబీసీ 18 టెలికాస్ట్ ప్రారంభం కానుండటంతో, షెడ్యూల్ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదని అమితాబ్ పేర్కొన్నారు. "ప్రసార తేదీ ఇప్పటికే ప్రకటించారు. ఈ సమయంలో నేను అందుబాటులో లేకపోయినా, ఆలస్యం చేసినా నా స్థానంలో మరొకరిని తీసుకునే అవకాశం ఉంటుంది. అందుకే చేయాల్సిన పనిని సమయానికి పూర్తి చేశాను" అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. 2000లో ప్రారంభమైన 'కౌన్ బనేగా కరోడ్‌పతి' కార్యక్రమానికి అమితాబ్ దాదాపు అన్ని సీజన్లలో హోస్ట్‌గా వ్యవహరించారు - మూడో సీజన్‌కు మాత్రమే షారుఖ్ ఖాన్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఆరోగ్యపరమైన సవాళ్లు ఎదుర్కొంటున్నప్పటికీ, ఈ వయసులోనూ ఆయన చూపిస్తున్న క్రమశిక్షణ, వృత్తిపరమైన నిబద్ధత అభిమానులతో పాటు సినీ ప్రముఖుల ప్రశంసలను అందుకుంటోంది. మరోవైపు అమితాబ్ సినిమాలతో కూడా బిజీగా ఉన్నారు - హిందీతో పాటు తెలుగు, తమిళ భాషల్లోనూ నటిస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. 'కల్కి' చిత్రంలో పాత్రతో అదరగొట్టిన ఆయన, ఇప్పుడు 'కల్కి 2' కోసం సిద్ధమవుతున్నారు.

# 'ఆర్సీ17' రేసులో రుక్మిణి



రామ్ చరణ్ మణికట్టు సర్జరీ నేపథ్యంలో.. ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. కోలుకున్న వెంటనే దర్శకుడు సుకుమార్‌తో కలిసి తెరకెక్కించనున్న 'ఆర్సీ17' షూటింగ్‌ను ప్రారంభించనున్నారు. 'రంగస్థలం' చిత్రం తర్వాత ఎనిమిదేళ్ల కు ఈ జోడీ మళ్లీ కలవడం విశేషం. ఇప్పటికే ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్ పూర్తవ్వగా, నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల ఎంపిక లో చిత్ర బృందం బిజీగా ఉంది. ఈ క్రమంలోనే, హీరోయిన్‌గా కన్నడ భామ రుక్మిణి వసంత్ పేరు జోరుగా వినిపిస్తోంది. 'సప్త సాగరాదాచె ఎల్లో' చిత్రంతో ఫిల్మ్‌ఫేర్ క్రిటిక్స్ అవార్డు అందుకున్న రుక్మిణి, ఇటీవల 'కాంతార: చాప్టర్-1'తో భారీ విజయాన్ని అందుకున్నారు. ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న 'డ్రాగన్' చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న ఆమె, రామ్‌చరణ్ తనకు ఇష్టమైన నటుడని గతంలో ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. దీంతో ఆర్సీ17లో ఆమెను ఖరారు చేసేందుకు మేకర్స్ ఇప్పటికే సంప్రదించినట్టు సమాచారం. అయితే, రుక్మిణితోపాటు మరో నటిని కూడా పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. నయనతార కీలక పాత్రలో నటించే అవకాశం ఉందన్న ప్రచారం కూడా జోరందుకుంది. దేవిశ్రీ ప్రసాద్‌కు బదులుగా శశ్వత్ సచ్‌దేవ్ సంగీత దర్శకుడిగా వ్యవహరించను న్నారన్న వార్తలూ ఉన్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న చిత్రాన్ని, దసరా తర్వాత ఫాస్ట్ షెడ్యూళ్లలో పూర్తి చేసేలా ప్లాన్ చేస్తున్నారు. స్టైలిష్ యాక్షన్ డ్రామాగా రూపొందనున్న ఈ ప్రాజెక్టుపై, రామ్ చరణ్-సుకుమార్ కాంబినేషన్ కావడంతో ఇప్పటికే ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. హీరోయిన్ ఖరారు అంశంపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన వెలువడిన తర్వాతే పూర్తి స్పష్టత రానుంది.



# రామాయణ.. ఆస్కార్ ఖాయమంటున్న ఫడ్నవీస్

నితేశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'రామాయణ' చిత్రానికి ఆస్కార్ అవార్డు రాకపోతే తీవ్రంగా నిరాశ చెందుతానని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ అన్నారు. నమిత్ మల్హోత్రా ప్రైమ్‌ఫోకస్ స్టూడి యోస్ ప్రారంభోత్సవంలో ఆయన ఈవ్యాఖ్యలు చేశారు. "రామాయణకి ఆస్కార్ రాకపోతే అకాడమీ అవార్డ్స్ జ్యూరీ విషయంలో నేను నిరాశపడతాను. ఇది సాధారణ సినిమా కాదు, కొన్ని వేల సంవత్సరాలు గుర్తుండిపోయే చిత్రం" అని ఆయన ప్రశంసిం చారు. రెండు భాగాలుగా రాబోతున్న ఈ చిత్రం, భారతీయ సినిమా స్థాయిని ప్రపంచ వేదికపై సరికొత్త శిఖరాలకు తీసుకెళు ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలోనూ ఫడణవీస్ ఈ సినిమా గురించి మాట్లాడారు - "భారత్‌లో ఎన్నో గొప్ప కథలు తెరకెక్కాయి, మన కళ, నాటక రంగం, సంగీతం చాలా పురాతనమైనవి. వీటికి తాజా సాంకేతికత జోడించాలని అనుకుంటున్నాం. రామాయణ విషయంలోనూ ఇదే జరుగుతోంది. ప్రధానితో కలిసి సెట్స్‌ను సందర్శించాను, వాటి క్వాలిటీ చూసి ఆశ్చర్యపోయాను. కొత్త తరానికి కథలు చెప్పడానికి ఇదే సరైన మార్గం" అని పేర్కొన్నారు. రణ్‌బీర్ కపూర్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న ఈ చిత్రం నవంబర్ 6న విడుదల కానున్నట్టు చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది. రెండో భాగం కూడా ఇప్పటికే 50 శాతం షూటింగ్ పూర్తయినట్టు రణ్‌బీర్ తెలిపారు. రూ.4,000 కోట్లతో రూపొందుతున్న ఈ భారీ చిత్రంపై రాజకీయ నేతల నుంచి కూడా ఇలాంటి ప్రశంసలు రావడం, సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది.